# వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక

బుధవారం, ఫిబ్రవరి 11, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-




# ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్!

- భారాస హయాంలో వాడిన పరికరాలే ఇప్పటికీ యాక్టివ్
- ఫోన్ ట్యాపింగ్‌పై మంత్రి పొంగులేటి సంచలన ఆరోపణలు
- ఫాంహౌస్‌లు, ఇళ్లలో దాచిన పరికరాలపై విచారణకు ఆదేశాలు
- ఉద్యోగులతో మాట్లాడిన విషయం బయటకు రావడమే సాక్ష్యమంటూ వ్యాఖ్య

ఖమ్మం: భారాస పాలనలో అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు ఉపయోగించిన పరికరాలను ఇప్పటికీ వినియోగిస్తున్నారని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఫోన్లు ప్రస్తుతం కూడా ట్యాప్ అవుతున్నాయన్న అనుమానాలు బలపడుతున్నాయని తెలిపారు. ఈ అంశాన్ని ప్రభుత్వం అత్యంత గంభీరంగా పరిగణిస్తోందని, పరికరాలు ఎక్కడ దాచారన్న దానిపై లోతైన విచారణ చేపడతామని స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మంలో మీడియాతో మాట్లాడిన మంత్రి.. అక్రమంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిని గుర్తించి, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏయే ఇళ్లలో, ఫాంహౌస్‌లలో ఈ పరికరాలు ఉన్నాయో, ఎంతమంది ఫోన్లను అక్రమంగా వినిపిస్తున్నారో పూర్తిస్థాయిలో తేలుస్తామని తెలిపారు.

### ఫోన్ సంభాషణ ఎలా లీక్ అయింది?

ఉద్యోగులతో తాను నిర్వహించిన ఫోన్ సంభాషణను భారాస నాయకులు విడుదల చేయడంపై మంత్రి తీవ్రంగా స్పందించారు. "మంత్రిగా ఉద్యోగులతో సమీక్షలు జరపడం సహజం. అలాంటి ఫోన్ కాల్స్ వివరాలు వారికి ఎలా తెలిసాయి? అంటే ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్ కొనసాగుతోందనే అనుమానం బలపడుతోంది" అని వ్యాఖ్యానించారు. ఉద్యోగులు ఓటర్లు కాదా? పార్టీకి ఓటేయాలని అడగడం తప్పేంటని ప్రశ్నించారు.

### మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

బుధవారం రాష్ట్రవ్యాప్తంగా 116 పురపాలికలు, ఏడు కార్పొరేషన్లకు పోలింగ్ జరగనున్న నేపథ్యంలో మంత్రి కీలక వ్యాఖ్యలు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 80 శాతం కంటే ఎక్కువ స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ గెలుపు ఖాయమనే నిజాన్ని జీర్ణించుకోలేక భారాస నాయకులు ఆక్రోశంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

### అప్పుల భారం మధ్యలోనూ సంక్షేమం

గత ప్రభుత్వం చేసిన రూ. 8 లక్షల కోట్ల అప్పులకు అసలు, వడ్డీలు



చెల్లిస్తూనే అభివృద్ధి ఆగకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. పేదల అభ్యున్నతే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయాలకే ప్రజలు శాసనసభ ఉప ఎన్నికలు, గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు మద్దతు ఇచ్చారన్నారు.

### ఇందిరమ్మ ఇళ్లపై స్పష్టత

రాష్ట్రంలో ఇప్పటికే 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు. ఏప్రిల్ నుంచి రెండో విడత ఇళ్ల మంజూరు ప్రారంభమవుతుందని, ఆ తర్వాత మూడో విడత కూడా చేపడతామని తెలిపారు. సీపీఐ నేత నారాయణ వ్యాఖ్యలపై స్పందించిన పొంగులేటి.. తాను సీఎం రేసులో లేనని స్పష్టం చేశారు. "నేను సామాన్య కార్యకర్తనే. పార్టీ ఇచ్చిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించడమే నా లక్ష్యం" అని చెప్పారు.



# నేడే మున్సి 'పోల్'

- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు జరగనున్న ఎన్నికలు
- ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్
- 52.17 లక్షల మంది ఓటర్లు.. 2,981 వార్డులు, 12,944 అభ్యర్థులు
- 8,191 పోలింగ్ కేంద్రాలు.. 100% కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్
- ఫిర్యాదుల స్వీకరణకు 9240021456 టోల్ ఫ్రీ నంబర్
- పోలింగ్ ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు నేడు సెలవు

హైదరాబాద్: రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు బుధవారం జరగనున్న ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరగనుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల పర్యిధిలోని 8,191 పోలింగ్ కేంద్రాల్లో 52.17 లక్షల మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. 2,981 వార్డులు, డివిజన్లకు గాను 12,944 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ప్రధాన రాజకీయ పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీతో పాటు సీపీఐ, సీపీఎం, ఆప్, ఎంఐఎం, ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తదితర పార్టీలు, స్వతంత్రులు బరిలో నిలిచారు. కాగా మున్సిపాలిటీల్లో 12 మంది కౌన్సిలర్లు, మున్సిపల్ కార్పొరేషన్లలో ఇద్దరు కార్పొరేటర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మక్తల్ మున్సిపాలిటీలోని ఆరో వార్డు బీజేపీ అభ్యర్థి ఎరుకల మహాదేవప్ప మరణంతో అక్కడ ఎన్నిక వాయిదా పడింది.

- మిగతా 2వ పేజీలో



## నా పేరును మార్చడానికి మీరెవరు?

- రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం
- మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలువడమేమిటని ఆగ్రహం
- అవసరమైతే రేవంత్ ఖాన్‌గా మార్చుకోవాలని ఎద్దేవా
- అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని నిలదీత

2లో



## కార్యకర్తలు ధైర్యంగా ఉండండి..

- బీజేపీ నాయకత్వం మీకు అండగా ఉంది: బండి సంజయ్
- గిరిజన బిడ్డ ఎరుకల మహాదేవప్ప ఆత్మహత్య
- ఆత్మహత్యపై స్పందించిన కేంద్ర మంత్రి బండి సంజయ్

# హైదరాబాద్‌లో రూ.1,511 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

- ఆక్రమణలపై నగరం నలువైపులా హైడ్రా చర్యలు
- కొండాపూర్‌లో 4 ఎకరాల చెరువును కాపాడిన హైడ్రా
- అల్వాల్ కొత్త చెరువు ఆక్రమణలు 8 ఎకరాల మేర తొలగింపు
- రాధాకృష్ణ నగర్‌లో 450 గజాల పార్కును కాపాడిన హైడ్రా
- జక్కిడి కాలనీలో 650 గజాల పార్కుకు ఫెన్సింగ్

హైదరాబాద్‌లో నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో హైడ్రా రూ. 1,511 కోట్ల విలువైన భూమిని రక్షించింది. ప్రభుత్వ భూములు, పార్క్ స్థలాలను ఆక్రమణల చెర నుంచి హైడ్రా విడిపించింది. ఆ భూముల చుట్టూ ఫెన్సింగ్ వేసి బోర్డులను ఏర్పాటు చేసింది. ఆక్రమణలను సీరియస్‌గా పరిగణిస్తున్న హైడ్రా... పార్కులు, చెరువులను ఆక్రమించిన వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తోంది.

### కొండాపూర్‌లో చెరువును కాపాడిన హైడ్రా

శేరిలింగంపల్లి మున్సిపల్ కార్యాలయం – మదీనాగూడ రోడ్డు మార్గం కొండాపూర్‌లో రూ. 700 కోట్ల విలువైన భూమిని హైడ్రా కాపాడింది. 4 ఎకరాల జంగం కుంటను పూడ్చేసి మట్టితో చదును చేసి ప్లాట్లుగా విక్రయించేందుకు సిద్ధమైన కబ్జాదారుల ఆట కట్టించింది. ఇటీవల మీడియాలో వచ్చిన కథనాల మేరకు రెవెన్యూ అధికారులతో హైడ్రా జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసింది. జంగం కుంటగా హైడ్రా నిర్ధారించుకుంది. కబ్జా చేసిన వారిపై రెవెన్యూ అధికారులు కేసులు కూడా పెట్టారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు ఫెన్సింగ్ వేసింది.



### అల్వాల్ కొత్త చెరువులో ఆక్రమణల తొలగింపు

మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్ కొత్త చెరువు 8 ఎకరాల మేర ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ప్లాస్టిక్ కంప్రెసివ్ యూనిట్, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ కార్యకలాపాలు నిర్వహిస్తూ చెరువును

- మిగతా 2వ పేజీలో



## కృష్ణా జలాల దోపిడీపై రేవంత్ సర్కార్ మౌనం: హరీష్

- ఏపీ 80% నీటిని దోచుకుంటుంటే సీఎం ఏం చేస్తున్నారు?
- అపెక్స్ కౌన్సిల్ మీటింగ్‌ను తక్షణమే డిమాండ్ చేయాలి.
- జూబ్లీహిల్స్ ప్యాలెస్‌కే పరిమితమైన రేవంత్ రెడ్డి.
- రాష్ట్ర హక్కుల రక్షణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోర వైఫల్యం.
- ఈఎన్‌సీ పోస్టుల భర్తీపై సర్కార్ నిర్లక్ష్యం వీడాలి : హరీష్

# హైదరాబాద్‌లో రూ.1,511 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా



కలుషితం చేస్తున్నారని స్థానికులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అలాగే అక్కడ పని వారికోసం తాత్కాలిక షెడ్డులు వేసి వ్యర్థాలన్నీ చెరువులోకి వదులుతున్నారని పేర్కొన్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోని టెంటు సామగ్రికి చెందిన 4 షట్టర్లు కూడా వేసినట్టు ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి చెరువు ఆక్రమణలను నిర్ధారించుకున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదనే నిబంధన పట్టకుండా ఏర్పాటు చేసిన షెడ్డులను హైడ్రా తొలగించింది.

**1100 గజాల పార్కులను కాపాడిన హైడ్రా**

వనస్థలిపురం సాహెబ్‌నగర్ కలాన్‌లోని జక్కిడినగర్ కాలనీలో 650 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. సర్వే నంబరు 132, 133లో 1982లో 12 ఎకరాల మేర దాదాపు 161ప్లాట్లతో జక్కిడి కుటుంబ సభ్యులు లే ఔట్ వేశారు. ఇందులో 650 గజాల మేర పార్కుకోసం కేటాయించారు. 1985లోనే దీనిని ప్లాట్లుగా చేసి లే ఔట్ వేసిన వారే అమ్మేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. ఈమేరకు ప్రహరీతో పాటు రెండు షెడ్డులు నిర్మించారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయిలో హైడ్రా పరిశీలించి పార్కు స్థలంగా నిర్ధారించుకుంది. మంగళవారం ఆక్రమణలు తొలగించి పార్కు చుట్టూ ఫెన్సింగ్ వేసింది. పార్కు స్థలంగా పేర్కొంటూ హైడ్రా బోర్డులు ఏర్పాటు చేసింది. మల్కాజిగిరి జోన్, మౌలాలి సర్కిల్ పరిధిలోని కాకతీయ నగర్‌లో రాధాకృష్ణ హౌసింగ్ కాలనీలో 450 గజాల పార్కును హైడ్రా కాపాడింది. జీహెచ్ఎంసీకి గిఫ్ట్ డీడ్‌గా ఇచ్చిన ఈ పార్కు స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన ప్రహరీతో పాటు రేకుల షెడ్డును హైడ్రా తొలగించింది.

# కృష్ణా జలాల దోపిడీపై రేవంత్ సర్కార్ మౌనం: హరీష్‌రావు



హైదరాబాద్: కృష్ణా నది జలాలను ఆంధ్రప్రదేశ్ అప్పనంగా తీసుకొని పోతుంటే తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జూబ్లిహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని కళ్లప్పగించి చూస్తున్నాడని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి హరీష్‌రావు ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్ నుంచి మీడియాతో మాట్లాడిన హరీష్‌రావు.. కృష్ణా జలాల 664 టీఎంసీలను , 80 శాతం ఆంధ్రప్రదేశ్ వాడుకుందని తెలంగాణ ఈఎన్‌సీ.. కేఆర్ఎంబీకి లేఖ రాశారని, మరి ఏపీ ప్రభుత్వం 80 శాతం నీళ్ళు వాడుకుంటే , రేవంత్ రెడ్డి , ఉత్తమ్‌లు గాడిద పళ్లు తోముతున్నారా?, 80 శాతం నీళ్ళు వాడుకుంటే, తెలంగాణ ప్రభుత్వం నిద్ర పోతుందా? అని నిలదీశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయం పై అపెక్స్ కౌన్సిల్ మీటింగ్ ఎందుకు ఏర్పాటు చేయడం లేదని , ఆ కౌన్సిల్ మీటింగ్ ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తుందని హరీష్ స్పష్టం చేశారు. రాష్ట్ర హక్కులను సీఎం రేవంత్‌రెడ్డి కాపాడాలని, ఈఎన్‌సీ పోస్టుల భర్తీపై సైతం సర్కార్ నిర్లక్ష్యంగా ఉందని హరీష్ మండిపడ్డారు.

# నేడే మున్సి‘పోల్’


(మొదటి పేజీ తరువాయి)

బుధవారం పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల సిబ్బంది పోలింగ్ సామగ్రితో సహా మంగళవారం సాయంత్రానికే తమకు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. 123 పురపాలక సంఘాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులతో తరలివెళ్లారు. సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత అధికారుల పర్యవేక్షణలో బ్యాలెట్ బాక్సులను ముందే ఎంపిక చేసిన 137 స్ట్రాంగ్ రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు తొలిసారిగా అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్‌కు ఏర్పాట్లు చేశారు. తద్వారా పోలింగ్ కేంద్రాల లోపలా, వెలుపలా పోలింగ్ ప్రక్రియను అధికారులు పర్యవేక్షించనున్నారు. డ్రోన్ల ద్వారా పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో నిఘాను ఏర్పాటు చేశారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పెద్ద ఎత్తున పోలీసు బలగాలను మోహరిస్తున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం రూపొందించిన ‘టీ పోల్ మొబైల్ ఆండ్రాయిడ్ యాప్’లో ఓటర్లు తమ ఫోటో ఓటరు గుర్తింపు కార్డు నంబరు (ఎపిక్) సహాయంతో ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతో పాటు పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకోవచ్చు. టీ పోల్ యాప్‌తో పాటు రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక వెబ్‌సైట్‌లోని ఓటర్ పోర్టల్ నుంచి కూడా ఓటరు స్లిప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పోలింగ్ ప్రక్రియపై ఫిర్యాదులు, అభ్యంతరాల స్వీకరణ కోసం ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నంబరు 9240021456ను ఏర్పాటు చేసింది. కాగా ఈ ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలకు సెలవు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు ప్రైవేటు వ్యాపార, వాణిజ్య సంస్థలు, పరిశ్రమల్లో పనిచేసే వారికి వేతనంతో కూడిన సెలవు వర్తింప చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# కార్యకర్తలకు బీజేపీ అండగా ఉంది

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల వేళ నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో భారతీయ జనతా పార్టీ 6వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి, గిరిజన బిడ్డ ఎరుకల మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర కలకలంగా మారింది. మాఫియా రాజకీయాలు, అహంకార ధోరణి తట్టుకోలేకే మహాదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ ఆత్మహత్యపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు స్పందించారు. మహదేవప్ప ఆత్మహత్య చేసుకోవడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఇది అత్యంత బాధాకరమైన ఘటన అని, మహదేవప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మహదేవప్పది ఆత్మహత్య కాదు కాంగ్రెస్ చేసిన హత్య అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. ‘ఓటమి భయంతోనే బెదిరింపులు, అరాచకాలకు పాల్పడుతున్నారు. కాంగ్రెస్ పార్టీని రాళ్లతో కొట్టే పరిస్థితి రాబోతోంది. మా సహనాన్ని పిరికితనంగా భావిస్తారా?. ఎన్నికల తరువాత కాంగ్రెస్‌పై యుద్ధం చేయబోతున్నాం. బీఆర్ఎస్ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన చరిత్ర బీజేపీ కార్యకర్తలది. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భూస్థాపితం చేసే రోజులొచ్చాయి. బీజేపీ కార్యకర్తలారా.. ధైర్యంగా ఉండండి, నాయకత్వం మీకు అండగా ఉంది. మహదేవప్ప కుటుంబాన్ని పరామర్శించేందుకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు బయలుదేరారు. మహదేవప్ప ఆత్మహత్యకు కారకులైన కాంగ్రెస్ నేతలను వెంటనే అరెస్ట్ చేయాలి. నిష్పాక్షికంగా విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి’ అని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# స్పీకర్‌ను తొలగించాలి



న్యూఢిల్లీ: లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు విపక్షాలు రంగం సిద్ధం చేసుకుంటున్నాయి. బిర్లాను స్పీకర్ పదవి నుంచి తొలగించాలని కోరుతూ ఆయనపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతామంటూ కాంగ్రెస్ పార్టీ మంగళవారం నోటీసిచ్చింది. రాజ్యాంగంలోని 94సి ఆర్టికల్ కింద లోక్‌సభ సెక్రెటరీ జనరల్ ఉత్పల్‌కుమార్ సింగ్‌కు దాన్ని అందజేసింది. “సభా వ్యవహారాల నిర్వహణలో ఓం బిర్లా పూర్తిగా ఏకపక్షంగా, విపక్షాల పట్ల వివక్షపూరితంగా వ్యవహరిస్తున్నారు. తద్వారా స్పీకర్ వంటి రాజ్యాంగబద్ధ పదవిని దుర్వినియోగం చేస్తున్నారు”అని ఆరోపించింది. లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉప నేత గౌరవ్ గొగోయ్, ఆ పార్టీ చీఫ్ విప్ కె.సురేశ్, విప్ మొహ్మద్ జావెద్ విపక్షాల తరపున మంగళవారం మధ్యాహ్నం సెక్రెటరీ జనరల్‌కు నోటీసు అందజేశారు. ఓం బిర్లాను లోక్‌సభ స్పీకర్ పదవి నుంచి తొలగించాలంటూ తీర్మానం ప్రవేశపెట్టేందుకు నోటీసిస్తున్నట్టు అందులో పేర్కొన్నారు. “సభలో పలుమార్లు విపక్ష సభ్యులను మాట్లాడేందుకు స్పీకర్ అనుమతించలేదు. ఫిబ్రవరి 2న రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై విపక్ష నేత రాహుల్‌గాంధీ ప్రసంగాన్ని పూర్తి కూడా చేయనివ్వలేదు. స్పీకర్ వివక్షాపూరిత ధోరణికి ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే. విపక్ష నేతను సభలో అసలు మాట్లాడనివ్వనే లేదు. ఫిబ్రవరి 4న ఒక బీజేపీ ఎంపీ మాజీ ప్రధానులపై అత్యంత అభ్యంతరకరంగా మాటల దాడి చేసేందుకు స్పీకర్ అనుమతించారు. పైగా అలా చేసినందుకు ఆయనను కనీసం ఒక్కసారైనా మందలించలేదు. ఇలాంటి ప్రవర్తనను అలవాటుగా మార్చుకున్న సదరు సభ్యునిపై తక్షణం చర్యలు తీసుకోవాలని మేం పదేపదే విజ్ఞప్తి చేసినా స్పీకర్ పట్టించుకోలేదు”అని నోటీసులో ఎంపీలు ఆరోపించారు. పలువురు కాంగ్రెస్ సభ్యులు సభలో ప్రధాని నరేంద్ర మోదీ స్థానం వద్దకు వెళ్లి ‘అనూహ్య చర్య’కు దిగాలని భావించినట్టు కచ్చితమైన సమాచారం తన వద్ద ఉందని స్పీకర్ చేసిన ప్రకటనను కూడా వారు ప్రస్తావించారు. “స్పీకర్ చేసిన ఈ ఆరోపణలు పూర్తి నిరాధారం. అంతేగాక కాంగ్రెస్ ఎంపీల పరువుప్రతిష్ఠలకు భంగం కలిగించేలా ఉన్నాయి. పార్లమెంటరీ పద్ధతులను, నియమ నిబంధనలను పరిరక్షించాల్సిన స్పీకరే ఇలాంటి నిరాధారణ ఆరోపణలు చేసేందుకు నిండు సభను వాడుకోవడం దారుణం. ఇది రాజ్యాంగబద్ధ పదవిని పూర్తిగా దుర్వినియోగం చేయడమే. ప్రజా సమస్యలపై గళమెత్తకుండా విపక్ష సభ్యులను స్పీకర్ పలుమార్లు అడ్డుకున్నారు”అంటూ నోటీసులో పేర్కొన్నారు. ఎనిమిది మంది విపక్ష ఎంపీలను ఏకపక్ష సస్పెండ్ చేయడం తదితరాలను కూడా అవిశ్వాస తీర్మానానికి కారణాలుగా వారు పేర్కొన్నారు. ఈ తీర్మానం మార్చి 9న సభ ముందుకు వచ్చే అవకాశమున్నట్టు లోక్‌సభ వర్గాలు పేర్కొన్నాయి.





## మంత్రి జూపల్లి చొరవతో నూతన గ్రామపంచాయతీ, గ్రంథాలయ భవనాలు

పానగల్, వార్తమిర్రర్: : పానగల్ మండల పరిధిలో మహమ్మదాపూర్ లో అభివృద్ధి పరుగులు తీస్తుంది. గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనం నిర్మాణం కోసం రూ.20 లక్షలు మంజూరు అయినట్లు గ్రామ సర్పంచ్ సుగుణమ్మ తెలిపారు. మంగళవారం గ్రామపంచాయతీ భవనానికి భూమి పూజ నిర్వహించారు. ఈ గ్రామ పంచాయతీ భవనం రెండు మూడు నెలల్లో పూర్తి చేయనున్నట్లు అలాగే గ్రామం లో కొత్తగా గంథాలయాన్ని కూడా నిర్మించనున్నట్లు సర్పంచ్ సుగుణమ్మ తెలిపారు. గ్రంథాలయం నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరు అయినట్లుగా పేర్కొన్నారు. నూతన గ్రామ పంచాయతీ భవనము మరియు గ్రంథాలయ భవనం ఏర్పాటుకు సహకరించిన మంత్రి జూపల్లి కృష్ణారావు గారికి సర్పంచ్ సుగుణ, గ్రామ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా గ్రంథాలయ చైర్మన్ లంకల గోవర్ధన్ సాగర్, గ్రామ మాజీ సర్పంచ్ జయరాములు సాగర్, కృష్ణయ్య సాగర్ కాంగ్రెస్ నేతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# నా పేరును మార్చడానికి మీరెవరు?

మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలవడానికి మీరెవరంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను ఎవరికో దత్తపుత్రుడినని, కల్వకుంట్ల కిషన్ రావు అని పేరు మార్చుకోవాలని ముఖ్యమంత్రి విమర్శలు చేయడం ఏంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పేరు మార్చి పిలవడం సరికాదని అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి మధ్య ఏమైనా ఉంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలోకి లాగవద్దని సూచించారు. అంతగా అవసరమైతే మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోవచ్చని, తమకు ఎలాంటి అభ్యంతరం లేదని అన్నారు. కానీ మా తల్లి పెట్టిన పేరును మార్చడానికి మీరెవరని ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలు సరికాదని హితవు పలికారు. మజ్లిస్ పార్టీతో కలిసి ముందుకు సాగినన్ని రోజులు మేం నిలదీస్తూనే ఉంటామని అన్నారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్‌ను అరెస్టు చేయాలంటూ మాకు చెప్పడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేస్తే ఎవరూ అడ్డురాకుండా తాను చూసుకుంటానని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? లేక కిషన్ రెడ్డిదా? తెలంగాణ ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకలు ఒక్కసారైనా కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడారా అని ప్రశ్నించారు. బీజేపీ ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీతో కలవలేదని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను రెండేళ్లు పూర్తయినా అమలు చేయలేదని విమర్శించారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని అన్నారు.

# విడుదలైన టీఎస్ టెట్ జనవరి 2026 ఫలితాలు

**మొత్తం 51.37 శాతం మంది అభ్యర్థుల ఉత్తీర్ణత**

**పరీక్ష రాసిన ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో 57.76 శాతం మంది అర్హత**

**ఉద్యోగం నిలుపుకోవాలంటే టెట్ పాసవ్వాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు**

**అర్హత సాధించని టీచర్లకు ఇంకా మిగిలి ఉన్న అవకాశం**

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష జనవరి 2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ మంగళవారం ఈ ఫలితాలను ప్రకటించారు. మొత్తం మీద 51.37 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించగా, ఈసారి ప్రభుత్వ ఉపాధ్యాయుల ఫలితాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ తప్పనిసరిగా పాస్ కావాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో వేలమంది ప్రభుత్వ టీచర్లు అర్హత సాధించలేకపోవడం చర్చనీయాంశంగా మారింది. తాజా ఫలితాల ప్రకారం పరీక్షకు హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో 57.76 శాతం మంది (37,893 మంది) అర్హత సాధించారు. ఇతర అభ్యర్థుల ఉత్తీర్ణత శాతం (48.14 శాతం)తో పోలిస్తే ప్రభుత్వ టీచర్ల పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, గణనీయ సంఖ్యలో టీచర్లు విఫలమయ్యారు. మొత్తం మీద పరీక్ష రాసిన 1,95,181 మందిలో 1,00,270 మంది ఉత్తీర్ణులయ్యారు. టెట్ ప్రవేశపెట్టక ముందు నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్‌లో అర్హత సాధించాలని గత ఏడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువులోగా ఉత్తీర్ణత సాధించలేకపోతే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తాజా ఫలితాలు సర్వీసులో ఉన్న టీచర్లకు కీలకంగా మారాయి. టెట్‌లో అర్హత సాధించలేకపోయిన ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను నిలుపుకోవడానికి ఇంకా అవకాశం ఉంది. సుప్రీంకోర్టు నిర్దేశించిన రెండేళ్ల గడువులోపు జరిగే తదుపరి టెట్ పరీక్షల్లో వారు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. టెట్ క్వాలిఫైయింగ్ సర్టిఫికెట్‌కు జీవితకాల వ్యాలిడిటీ ఉండటంతో పాటు, ఉపాధ్యాయ నియామక పరీక్ష లో 20 శాతం వెయిటేజీ లభిస్తుంది.

## ఉద్యోగ ఉపాధ్యాయుల ఓటు రహస్యతకు భంగం కలుగకుండా చూడాలి

### పోస్టల్ బ్యాలెట్ లెక్కింపులో మార్పులు చేయాలి...

### రాష్ట్ర ఎన్నికల కమీషన్ కు రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ వినతి

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 10

మున్సిపల్ ఎన్నికలలో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగులు వినియోగించిన పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు ప్రక్రియలో ఓటు రహస్యత (సీక్రెసీ అఫ్ ఓటు) భంగం కలుగుతున్నట్లు రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ తెలంగాణ, జగిత్యాల జిల్లా శాఖ కోరుతుంది. ప్రస్తుతం పోస్టల్ బ్యాలెట్ ఓట్లను అందరి ముందూ చూపిస్తూ లెక్కించడం, వాటిని ప్రత్యేకంగా కౌంట్ చేయడం వల్ల ఉపాధ్యాయ ఉద్యోగులు ఎవరికి ఓటు వేశారో బహిర్గతమయ్యే ప్రమాదం ఉన్నదని మా సంఘం భావిస్తుంది. దీని ద్వారా భవిష్యత్తులో రాజకీయ కక్షసాధింపులు, ప్రతీకార చర్యలకు గురయ్యే పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయ ఉద్యోగుల పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో రైట్ మార్కు విధానం స్థానంలో స్వస్తిక్ గుర్తుతో ఓటు వేయించే విధానాన్ని అమలు చేయాలని, అలాగే పోస్టల్ బ్యాలెట్ ఓట్లను ప్రత్యేకంగా చూపించకుండా అన్ని ఓట్లలో కలిపి గణించే విధానాన్ని ప్రవేశపెట్టాలని, ఈ మున్సిపల్ ఎన్నికలలోనే కాకుండా, భవిష్యత్తులో జరగబోయే అన్ని ఎన్నికలలోనూ ఉద్యోగులు వేసే పోస్టల్ బ్యాలెట్ ఓట్ల విషయంలో ఓటు రహస్యతను సంపూర్ణంగా కాపాడేలా స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని రాష్ట్ర ఎన్నికల కమీషనర్ కు రికగ్నైజ్డ్ ఉపాధ్యాయ పండిత పరిషత్ జగిత్యాల జిల్లా శాఖ విజ్ఞప్తి చేసినట్లు జిల్లా శాఖ అధ్యక్షులు వేల్పుల స్వామి యాదవ్, జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఎనగందుల రాజేంద్రప్రసాద్, జిల్లా గౌరవ అధ్యక్షులు అలకట్టు సత్యనారాయణ లు తెలిపారు.

## ఇష్టానుసారంగా దోమల నివారణకు రసాయనాలు పిచికారి ..

### ప్రజలు అనారోగ్యం పాలు అయితే బాధ్యత ఎవరిది .. బీజేపీ నేత గణేష్ ముదిరాజ్..



మియాపూర్ వార్త మిర్రర్ : ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలను మంచిగా చేసుకోవడం కోసం మేమున్నామంటూ ముందుకు వస్తున్న కొందరు రాజకీయ నాయకులు దోమల నివారణకు రసాయనాలు పిచికారి చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని మియాపూర్ డివిజన్ బీజేపీ సీనియర్ నాయకుడు గుండె గణేష్ ముదిరాజ్ అన్నారు. ఇన్నాళ్ళు ప్రజల బాగోగులు పట్టించుకొని అవకాశవాదులు ఇప్పుడు మేమేదో ఉద్ధరిస్తామనే భ్రమలో రోజుకో పార్టీ నాయకుడు వచ్చి మక్త మహబూబ్ పేట్ లో దోమల మందు పేరుతో పలు రకాల రసాయనాలు పిచికారి చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆరోపిం చారు. ప్రజల బాగోగులు చూడాల్సిన మున్సిపల్ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదనీ ప్రశ్నించారు. బయటి వ్యక్తులు నకిలీ రసాయనాలు పిచికారి చేస్తుంటే నిరోధించాల్సిన అధికారులు ఎందుకు మౌనంగా ఉంటున్నారని ప్రశ్నించారు. బయట వ్యక్తులు పిచికారి చేసే రసాయనాల వల్ల ప్రజలకు ఏవైనా రోగాలు వచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటే బాధ్యులు ఎవరని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. రక రకాల రసాయనాలు పిచికారి చేస్తుంటే ప్రజలు రోగాల భారిన పడే అవకాశం ఉందని, అధికారులు స్పందించి విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ అధికారులు చేయాల్సిన పనులు ప్రయివేట్ వ్యక్తులు చేస్తుంటే చూస్తుంటారా, అధికారులకు బాధ్యత లేదా అని, వీటిపై విచారణ జరపాలని ప్రజల తరుపున డిమాండ్ చేస్తున్నట్లు ఆయన తెలిపాడు.

## మీరు నాకు తోడుగా నిలవండి.. నేను మీకు అండగా ఉంటా

- మహిళ యువ నాయకత్వానికి అవకాశం ఇవ్వండి
- ఇంటిని చక్కబెట్టినట్లుగానే వార్డును అభివృద్ధి చేస్తా
- బీజేపీ 15 వార్డ్ కౌన్సిలర్ అభ్యర్థి పెద్దారి విందు



కల్వకుర్తి, ఫిబ్రవరి 10 వార్త మిర్రర్ ప్రతినిధి:– నేడు

కల్వకుర్తి మున్సిపాలిటీ లో జరగబోయే ఎన్నికల్లో 15వ వార్డ్ బీజేపీ కౌన్సిలర్ అభ్యర్థి గా పెద్దారి విందు మంగళ వారం వార్డు అభివృద్ధిని ఉద్దేశించి మాట్లాడుతూ.. మహిళా యువ నాయకత్వానికి ఒకసారి అవకాశం ఇవ్వాలని కోరారు.అభివృద్ధి, పారదర్శకత, ప్రజలకు అందుబాటులో ఉండే పాలననే తన లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆమె తెలిపారు. బీజేపీ పార్టీ సిద్ధాంతాలను స్థానిక పాలనలో అమలు చేయడమే తన ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు.కల్వకుర్తి 15వ వార్డ్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి కొరత, రోడ్ల దుస్థితి, డ్రైనేజీ సమస్యలు, పారిశుధ్యం, మహిళల భద్రత వంటి కీలక అంశాల పై ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తానని పెద్దరి విందు స్పష్టం చేశారు. సమస్యల పై కేవలం హామీలకే పరిమితం కాకుండా, ప్రజల మధ్య ఉండి ప్రత్యక్షంగా పరిష్కారాలు చూపించే నాయకత్వాన్ని అందిస్తానని భరోసా ఇచ్చారు."ఒక మహిళ తన ఇంటిని ఎలా చక్కగా, బాధ్యతతో చూసుకుంటుందో, అదే విధంగా నా వార్డ్‌ను కూడా నా ఇంటిలా భావించి అభివృద్ధి చేస్తాను" అని ఆమె అన్నారు.దేశవ్యాప్తంగా అభివృద్ధి, సంక్షేమం, జాతీయ భావనతో ముందుకు సాగుతున్న బీజేపీ పాలన స్ఫూర్తితో కల్వకుర్తి 15వ వార్డ్‌ను కూడా అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆమె తెలిపారు. యువత, మహిళలు, అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని వెల్లడించారు. ఈ ఎన్నికలు వ్యక్తిగత రాజకీయాల కోసం కాకుండా, వార్డ్ భవిష్యత్తును నిర్ణయించే ఎన్నికలు అని పేర్కొన్న పెద్దరి విందు, ప్రజలందరూ బీజేపీ గుర్తుపై ఓటు వేసి తనను ఆశీర్వదించాలని కోరారు



## మహాత్మాగాంధీ జాతీయ అవార్డుల కార్యక్రమంలో సేవా పురస్కారం అందుకున్న వై.వి.రమణ ..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : రవీంద్ర భారతిలో తెలంగాణ

రాష్ట్ర వికలాంగుల సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మాగాంధీ జాతీయ అవార్డు కార్యక్రమంలో పాల్గొన్న పటాన్ చెరు పద్మ శాలి సంఘం జాయింట్ సెక్రటరీ , ప్రజా నాయకులు వై. వి. రమణ కు వారు చేస్తున్న సేవా కార్యక్రమాలకు గాను గుర్తించి వికలాంగుల రాష్ట్ర కమిటీ సభ్యులు వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పి.నాగులు అధ్వర్యంలో సినీ గాయకుడు నల్గొండ గద్దర్ నరసన్న సమక్షంలో అవార్డు, ప్రశంసా పత్రం ను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సినీ నటులు పసునూరి శ్రీనివాస్, కరింగీల కావ్య ,నాయకులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.వి రమణ కమిటీ వారికి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు.

## పోరాటాల నుంచే కార్మిక చట్టాలు:వీరయ్య

### లేబర్ కోడ్లతో ఉద్యోగ భద్రత యూనియన్ హక్కులకు ముప్పు



కాప్రా వార్త మిర్రర్ ఫిబ్రవరి 10 : ఉద్యమాలు, పోరాటాల ద్వారానే కార్మిక హక్కులు, చట్టాలు సాధ్యమయ్యాయని, ఈ చారిత్రక సత్యాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య అన్నారు.ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిస్తూ మంగళవారం నాచారం చౌరస్తాలో నాచారం ఇండస్ట్రియల్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ జిల్లా సీఐటీయూ కోశాధికారి పి.గణేష్ అధ్యక్షతన నిర్వహించిన కార్మిక సదస్సులో ఎస్.వీరయ్య ముఖ్య వ్యక్తగా హాజరై ప్రసంగిస్తూ కార్మికుల రక్తత్యాగాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కార్పొరేట్ లాభాల కోసం రద్దు చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్లు అమలైతే ట్రేడ్ యూనియన్ హక్కులు, ఉద్యోగ భద్రత పూర్తిగా దెబ్బతింటాయని హెచ్చరించారు.పర్మినెంట్ ఉద్యోగాలను తొలగించి కాంట్రాక్ట్, ఫిక్స్‌డ్ టర్మ్ ఉపాధిని శాశ్వతం చేయాలన్న ప్రభుత్వ యత్నం కార్మిక వర్గాన్ని ఆధునిక బానిసత్వంలోకి నెట్టే ప్రమాదం ఉందన్నారు.షాహీ పరిశ్రమలో 1,600 మంది మహిళా కార్మికులు ఎలాంటి యూనియన్లకు చెందకుండానే తమ వేతనాల కోసం పది రోజుల పాటు రాత్రింబవళ్లు పోరాడి హక్కులు సాధించుకున్న ఉదాహరణను ఆయన గుర్తు చేశారు. పోరాటం లేకుండా హక్కులు లభించవని ఇది స్పష్టంగా నిరూపిస్తోందన్నారు.లేబర్ కోడ్ల పేరుతో కార్మిక వ్యతిరేక, కార్పొరేట్ అనుకూల విధానాలను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్ల రద్దు కోసం 2026 ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఏఐటిఈయుసి రాష్ట్ర నాయకులు వి.ఎస్.బోసు మాట్లాడుతూ కార్మికులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు మూలం కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలేనని, కార్పొరేట్ లాభాల కోసం కార్మిక హక్కులు, రైతు ప్రయోజనాలను తాకట్టు పెడుతూ, లేబర్ కోడ్లు, విద్యుత్ సవరణ చట్టం, విత్తన బిల్లుల రూపంలో దాడి చేస్తోందని విమర్శించారు. ఈ విధానాలను వెనక్కి తీసుకునే వరకు కార్మికులు--రైతులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు.ఐఎన్టీయూసీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. కార్పొరేట్ వర్గాల ఒత్తిడికి లోబడి కేంద్ర ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తోందని విమర్శించారు. లేబర్ కోడ్లు, ఇతర ప్రజావ్యతిరేక నిర్ణయాలను వెనక్కి తీసుకునే వరకు పోరాటం తప్పదని, ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారయ్య మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలే కార్మిక వర్గంపై పెరుగుతున్న దాడులకు కారణమని విమర్శించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఫిబ్రవరి 12న జరగనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు జి.శ్రీనివాసులు, ఐ ఎఫ్ టి యు నాయకుల శివబాబు, ప్రవీణ్, ఎన్ ఐఈయు అధ్యక్షుడు శేఖర్ రెడ్డి, ఎఐటియుసి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శంకర్ రావు, సిఐఈయు అధ్యక్షుడు బివి సత్యనారాయణ, ఏపీరాక్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్ మణికంఠ, వాయిత్ ఇండియా యూనియన్ ప్రధాన కార్యదర్శి సత్యంగౌడ్, కాకతీయ కెమికల్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, గ్రో కంట్రోల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి యం.డి.షకీల్, హార్డ్వేస్ ఇంజినీరింగ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి రమేష్, నాచారం, మల్లాపూర్ ఏరియా కార్మిక సంఘాలు వివిధ పరిశ్రమ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



కాప్రా, వార్త మిర్రర్ ,ఫిబ్రవరి 10: ఉప్పల్ నియోజకవర్గంలో ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించే దిశగా పలు కీలక అభివృద్ధి పనులకు గాను మంగళవారం పలు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొని పనులను ప్రారంభించారు.కాప్రాలోని ఫుట్‌బాల్ గ్రౌండ్ వద్ద స్పోర్ట్స్ అరేనా, సమాధి స్థల అభివృద్ధి పనులకు వ్యయం రూ. 22.80 కోట్లు, కుషాయిగూడ,చెర్లపల్లి వార్డు పరిధిలో స్టార్మ్ వాటర్ డ్రైన్లు, సమాధి స్థలాలు, సీసీ రోడ్లకు సంబంధించిన 6 పనులకు గాను వ్యయం రూ. 19.36 కోట్లు,బండబావి, మీర్ పేట హౌసింగ్ బోర్డు డివిజన్ ప్రాంతంలో ఇండోర్, అవుట్‌డోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణం కోసం వ్యయం రూ. 9 కోట్లు,ఉప్పల్ వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ భవనం, ఆర్.ఓ. వాటర్ ప్లాంట్ ఏర్పాటు కోసం వ్యయం రూ. 2.10 కోట్లు,నల్ల చెరువు వద్ద ఎస్ ఎన్ డి పి పనులకు వ్యయం రూ. 34.99 కోట్లు,ఉప్పల్ బాగాయత్ -- హెచ్‌ఎండిఏ ఆధ్వర్యంలో చేపట్టనున్న అభివృద్ధి పనులు.ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, క్రీడా వసతులు, విద్య, మౌలిక సదుపాయాల అభివృద్ధితో ఉప్పల్‌ను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు మరియు పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## దేవరకొండలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన




దేవరకొండ ఫిబ్రవరి 10 వార్త మిర్రర్ :

గిరిజన సంక్షేమ శాఖ దేవరకొండ డివిజన్లోని విద్యాసంస్థలు ఆశ్రమ పాఠశాలలో వసతి గృహాల నందు విద్యను అభ్యసిస్తున్న పదవ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఎస్ఎస్సి 2025 26 విద్యా సంవత్సరం పరీక్షలపై అవగాహన మోటివేషన్ తరగతులు ప్రభుత్వ వై టి సి పెంచికల్పహాడ్లో నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా గిరిజన సహాయ అభివృద్ధి అధికారి ఎం శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు పదవ తరగతి పరీక్షల పై సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. ఆయా సబ్జెక్టులపై సబ్జెక్టు నిపుణులు విద్యార్థులకు మెలకువలను నేర్పించారు అదేవిధంగా ఇంపాక్ట్ ఆర్గనైజేషన్ పి రవికుమార్ కే సాయి కిరణ్ జి అంజి రెడ్డి లు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు మానసిక రుగ్మత మేనేజ్మెంట్ పై పరీక్షలు పరీక్షలలో కలిగే ఫోబియా కెరీర్ గైడెన్స్ గోల్డ్ సెట్టింగ్ లపై పిల్లలకు నివృత్తి చేయడం జరిగింది. విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధిస్తామని తమ విజయలక్ష్మి వరకు వెనుతిరిగేది లేదని ఈ సందర్భంగా విద్యార్థులు తెలిపారు ఈ కార్యక్రమానికి ఏ సి ఎం ఓ స్పోర్ట్స్ ఆఫీసర్ ఆయా ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు మరియు వసతి గృహ సంక్షేమ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జగిత్యాలను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా..

### విరాపూర్ లో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన

### జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్



వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఫిబ్రవరి 10

జగిత్యాల జిల్లా రాయికల్ మండల వీరాపూర్ గ్రామంలో 10 లక్షల నిధులతో మహిళా సమాఖ్య భవన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన జగిత్యాల శాసనసభ్యులు డా సంజయ్ కుమార్. వీరాపూర్ అనుబంధ గ్రామాలకు అదనపు బస్సు కోసం వినతి కోరగా రవాణా శాఖ మంత్రి తో మాట్లాడి అదనపు బస్సు సర్వీసులు పునరుద్ధరణ కు కృషి చేస్తా అన్నారు ఎమ్మెల్యే. గ్రామంలో నీటి లీకేజీ సమస్య ను గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సమస్య పరిష్కరించాలని ఎంపీడీవో, సెక్రటరీని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గ్రామానికి 10 లక్షల చొప్పున రెండు, ఒకటి 30 లక్షల గోదాం మంజూరు చేయటం జరిగింది. వాటిలో గోదాం, మహిళ సంఘం, కమ్యూనిటీ ఆక్టివిటీ భవనం ఉన్నాయి. మహిళలకు నిధులు సక్రమంగా ఉపయోగపడాలని గత 2025 జనవరిలో ఐఏఎస్ సృజన మేడం ను హైదరాబాద్ లో కలిసి మహిళా సంఘం గోదాం పై వినతి పత్రాన్ని ఇవ్వగా నేడు రాష్ట్ర స్థాయిలో మహిళల కోసం ప్రభుత్వం అమలు చేస్తుంది అన్నారు. నిరంతరం అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేయటం జరిగింది అన్నారు. గ్రామాల మౌలిక సదుపాయాలు కల్పన కోసం ప్రభుత్వం తో కలిసి పనిచేస్తున్నా...అభివ్రుద్ధి కోసం అధికార పార్టీ తో కలిసి పనిచేస్తున్నా..మహిళలు,రైతులు,యువత అందరూ నాకు అండగా ఉండండి జగిత్యాలను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతా..కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు రాష్టానికి భారంగా మారాయి. కేంద్ర నిధుల్లో సంఘం భవనల నిర్మాణము చేస్తే నే రోడ్ల నిర్మాణానికి నిధులు కేటాయింపు చేశారన్నారు. ఎంజిఎన్ఆర్ఎజిఎస్ పేరు మార్చి వీబీ జి రాం గా పెట్టి కఠినంగా నిబంధనలు అమలు చేస్తున్నాయి..పేరు మార్పు పై నాకు ఎలాంటి అభ్యంతరం లేదని, కేంద్రం ఈ నిబంధనలు మార్చాల్సిన అవసరం ఉంది అన్నారు. బీద మధ్యతరగతి వారు, భూమిలేని, ఉపాధి కూలీలు కోసం తెచ్చిన పథకాన్ని కేంద్రం దుర్వినియోగం చేస్తుంది. తెలంగాణ రాష్ట్ర కూలీల పక్షాన వీబీ జి రాం పథకాన్ని పూర్తి గా ఖండిస్తున్నా...తెలంగాణ రాష్ట్రం కేంద్రానికి జి ఎస్ టి రూపం లో పన్నుల్లో చెల్లిస్తే రాష్టానికి హక్కుగా రావాల్సిన 40 శాతం నిధుల్లో నిబంధనలు పెట్టడం సరికాదు అని అన్నారు. జిల్లా కేంద్రంలో 4 కోట్ల తో ఇందిరా మహిళా శక్తి భవనం దాదాపు పూర్తి కావచ్చింది అని మహిళలు ఉపయోగం అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ చిరంజీవి, ఎమ్మార్వో నాగార్జున, సర్పంచ్ దిండిగల గంగు రామస్వామి, ఉప సర్పంచ్ దుంపల నర్సారెడ్డి, మాజీ పాక్స్ చైర్మన్ రాజిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రవీందర్ రావు, మాజీ ఏఎంసీ ఛైర్మెన్ గన్నె రాజిరెడ్డి, సీనియర్ నాయకులు కోల శ్రీనివాస్, సురేందర్ నాయక్, ముఖిద్, జోగినిపెల్లి తిరుపతి గౌడ్, మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షులు బెజ్జంకి మోహన్, ఏఈ ప్రసాద్, మాజీ సర్పంచ్ నీలి చిన్న మల్లయ్య, వార్డ్ మెంబర్ చెట్లపెల్లి అంజయ్య, జనా గోపి, నాయకులు, అధికారులు మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసేవలో ఐదేళ్లు అభివృద్ధి బాటలో

## హైదరాబాద్ -- డిప్యూటీ మేయర్ శ్రీలత పదవీకాలం ముగింపు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 10 : జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ గా ఐదేళ్ల కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసినట్లు డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్రెడ్డి తెలిపారు. ఈ మేరకు డిప్యూటీ మేయర్ గా అధికారికంగా మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు సహకరించిన మేయర్ గద్వాల విజయలక్ష్మీకి, జీహెచ్ఎంసీ కమీషనర్లకు, ప్రజాప్రతినిధులకు ఉన్నతాధికారులకు, ఉద్యోగులకు, పారిశుద్య కార్మికులు, కార్యాలయ సిబ్బందికి, స్వచ్ఛంద సంస్థలు, మీడియా ప్రతినిధులకు, నగర ప్రజలందరికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. డిప్యూటీ మేయర్ గా తనకు అప్పగించిన ఈ బాధ్యతను ప్రజా సేవే పరమావధిగా హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి బాటలో నడిపించామన్నారు. నగర వ్యాప్తంగా మౌళిక వసతుల అభివృద్ధి, రహదారి విస్తరణలు, ఫుట్పాత్ల నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ బలోపేతం, మురుగు నీటి శుద్ధి కేంద్రాల అభివృద్ధి, త్రాగు నీటి సరఫరా మెరుగుదల, చెత్త నిర్వాహణలో ఆధునిక సాంకేతికత వినియోగం వంటి అనేక కీలక రంగాల్లో ముందుండి నడిపించామన్నారు. కోవిడ్-19 విపత్కర పరిస్థితుల్లో, 2020-21లో సంభవించిన భారీ వర్షాలు వరదల సమయంలో అధికారులను సమన్వయం చేస్తూ ప్రజలకు సహాయక కార్యక్రమాలు చేపట్టామన్నారు.



## తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన బి. శ్యాము కు ఘన సన్మానం

సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 10 ....

తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తొలిసారిగా ఒక దళిత అధికారి ఎన్నిక కావడం చారిత్రక ఘట్టమని వక్తలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆఫీసర్స్ ఫోరం ఆధ్వర్యంలో నగరంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవనంలో నూతనంగా ఎన్నికైన బి. శ్యాము కి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చీఫ్ సెక్రటరీ (రిటైర్డ్) శ్రీ కాకి మాధవరావు అధ్యక్షత వహించారు. అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షులు పి.వి. రమణతో పాటు సంఘ నాయకులు పాల్గొని, అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం తరపున బి. శ్యాము ను ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ అధ్యక్షులు మల్లేపల్లి లక్ష్మయ్య, ఐడిఏఎస్ (రిటైర్డ్) పి.ఎస్.ఎన్. మూర్తి, ఆఫీసర్స్ ఫోరం కన్వీనర్ శ్రీ సిద్ధోజి రావు, కేకే రాజా, పీపుల్స్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సిహెచ్. బాలకృష్ణ, రాజేంద్రకుమార్, జగదీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.అలాగే అనేకమంది ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్--1 అధికారులు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని బి. శ్యాము కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గుమ్మల సరిత- మల్లేశం ను గెలిపించండి అభివృద్ధి బాధ్యత మాది.

**భువనగిరిలో పైళ్ళ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ చేసింది ఏమీ లేదు.**

**కారు గుర్తుకు ఓటు వేయండి అభివృద్ధి చేసి చూపిస్తాం - డాక్టర్ ర్యాకల శ్రీనివాస్**



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి

భువనగిరి మున్సిపాలిటీ ఎన్నికల్లో బిఆర్ఎస్ బలపరిచిన కౌన్సిలర్ అభ్యర్థులను గెలిపించాలని బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. భువనగిరిలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన అభివృద్ధి తప్ప రెండు సంవత్సరాల పైన గడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదని తెలిపారు. మన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే బిఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. 28వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థి గుమ్మల సరిత- మల్లేశం గారిని భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో అమలు కానీ హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని, వారు ఇచ్చిన హామీలు అమలు కావాలంటే కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు



## వైదిక హరిహర సంఘం భవనంలో పరాభవ నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ

**భారతీయ సాంప్రదాయంలో పంచాంగమునకు విశిష్టత ఉంది -- బ్రహ్మశ్రీ శ్రీనివాస శర్మ**



హయత్ నగర్ వార్తా మిర్రర్ ప్రతినిధిహయత్ నగర్ వైదిక హరిహర సంఘ భవనంలో సంఘం అధ్యక్షులు బ్రహ్మశ్రీ పగిడిమర్రి శ్రీనివాస శర్మ గారి అధ్యక్షతన పరాభవ నామ సంవత్సర పంచాంగ ఆవిష్కరణ జరిగినది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్ధాంతకర్తలు సూర్యచంద్రుల గమనాన్ని బట్టి తిథి వార నక్షత్ర యోగ కరణాలను గణన చేసి మనకు పండుగలు గ్రహణాలు పుష్కరములు, మౌఢ్యములు మొదలగునవి మున్ముందుగానే గణన చేసి తెలిపేదే పంచాంగం అని అదే మనకు కాలసూచి అని తెలిపారు ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బ్రహ్మశ్రీ గౌరీభట్ల సురేష్ శర్మ, కోశాధికారి చాడా శ్రీనివాస శర్మ ,పెద్ది కృష్ణ కిషోర్ శర్మ, కొండూరు శ్రీధర్ రావు, నేరేళ్లపల్లి ఆంజనేయ శర్మ, అష్టావధాని గౌరీభట్ల రఘురామ శర్మ, తదితరులు పాల్గొన్నారు

# ఆలోచనాత్మకమైన ప్రసంగాలతో ముగిసిన అంతర్జాతీయ భాషోత్సవాలు..





సికింద్రాబాద్, వార్త మిర్రర్ ఫిబ్రవరి 10 ... దాదాపు 50 పరిశోధనా పత్రాలతో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ, తెలుగు సంపద సంస్థల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన అంతర్జాతీయ భాషా సమావేశాలు ముగిసినాయి.. అన్ని రంగాల్లో తెలుగు ప్రాధాన్యాన్ని, భాష పరివ్యాప్తి, పరిరక్షణ అవసరాలను ఈ సమావేశాలు సమీక్షించాయి.. ముగింపు సమావేశంలో ఆచార్య గౌరీ శంకర్, గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ అమెరికా అధ్యక్షుడు కలువల విశ్వేశ్వర రెడ్డి భాష ప్రాధాన్యాన్ని చెప్పారు.. ఉస్మానియా తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు. అంతర్జాతీయ భాషా సమావేశాలు ముగింపు ఉత్సవం లో పాల్గొన్న తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకర శర్మ, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి గౌరీశంకర్, సిటీ కళాశాల తెలుగు అధ్యాపకులు ఆచార్య కాకునూరి సూర్య నారాయణ మూర్తి, తెలుగు శాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డా. రఘు, తెలుగు సంపద వ్యవస్థాపక అధ్యక్షులు డా. రెమిల్ల మూర్తి, డా. సగిలి సుధారాణి, డా. పాతూరి రామకృష్ణ తో పాటు పలువురు అధ్యాపకులు ప్రొఫెసర్లు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అంతకుముందు ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో రెండవ తెలుగు లిటరరీ కాంగ్రెస్ రెండవ రోజు ఆర్ట్స్ కళాశాల లలో వివిధ అంశాలపై సదస్సు నిర్వహించారు. రూమ్ నెంబర్ 121 లో మంగళవారం " దేశ విదేశాలలో " తెలుగు భాషా వ్యాప్తికి జరుగుతున్న కృషి- మార్గదర్శనం" అనే అంశంపై పద్మ విభూషణ్ సంజీవ నరసింహ అధ్యక్షతన చర్చను నిర్వహించారు. జయ పీసపాటి మాట్లాడుతూ హాంకాంగ్ లో తాము తెలుగు ఫెస్టివల్ ను నిర్వహించడంతోపాటు పిల్లలకు నాట్యం, నృత్యం, వాద్యం లను నేర్పిస్తున్నామని తెలిపారు. అలాగే తెలుగు బడి కార్యక్రమాన్ని కూడా కొనసాగిస్తున్నామని చెప్పారు. అమెరికా న్యూయార్క్ నుంచి హాజరైన గూడూరు శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు లిటరరీ అసోసియేషన్ ద్వారా తాము తెలుగు సాహిత్య సేవలు చేస్తున్నామని చెప్పారు. పద్యాలు, లలిత గీతాలు, నేర్పిస్తున్నామన్నారు. గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ ద్వారా తమ కార్యక్రమాలను 30 దేశాలకు విస్తరింప చేశామని కల్వల విశ్వేశ్వర్ చెప్పారు. 100 దేశాల్లో తెలుగు భాష ఉందని వివరించారు. ఆస్ట్రేలియా నుంచి హాజరైన విజయ మాట్లాడుతూ ప్రతి శనివారం రెండు గంటలపాటు తాము తెలుగులో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు . తెలుగు భాష ఉత్సవాన్ని నిర్వహించడంతోపాటు భారతం, భాగవతాన్ని పిల్లలకు నేర్పిస్తున్నామన్నారు. రేడియో కార్యక్రమాలు కూడా చేపడుతున్నామన్నారు. జర్మనీ నుంచి హాజరైన గణేష్ తొట్టిపూడి మాట్లాడుతూ సిపి బ్రౌన్ తెలుగు వ్యాకరణాన్ని అందుబాటులోకి తీసుకురావడంతో పాటు తెలుగు భాషను నేర్చుకోవడం కోసం టూల్స్ డెవలప్ చేసామని చెప్పారు. ఇక్కడ మూడు నాలుగు తరాల నుంచి తెలుగు భాషను మాట్లాడుతూ కాపాడుతున్నారని వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో వడ్లమాని దుర్గ, జంధ్యాల కిషోర్ శరత్ బాబు లు మాట్లాడుతూ బాల్యం నుంచే తెలుగు భాష పై మక్కువ కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. మూర్తి రేమిళ్ళ, వెల్మల కృష్ణారావు,నరసింహులు మరాఠీ ఇస్రో రిటైర్డ్ సైంటిస్ట్ జయకృష్ణ కిషోర్, నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె వి ఎన్ డి ప్రసాద్ సగిలి సుధారాణి తదితరులు ప్రసంగించారు."తెలుగు భాషా పరిశోధనలో శాస్త్ర సాంకేతిక సాధనాల వినియోగం" అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆచార్య వై రెడ్డి శ్యామల అధ్యక్షత వహించారు. ఆధునిక సాంకేతికతతో తెలుగు భాషకు మెరుగులు దిద్దాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆన్లైన్లో తెలుగు భాషా బోధన గురించి డాక్టర్ ఝాన్సీ ఉడుము, తెలుగు భాషా పరివ్యక్తికి మార్గాలు అనే దానిపై సిరికొండ నరసింహ రాజు, తెలుగులో సాంకేతిక అభివృద్ధి- సాంకేతిక వినియోగం పై రెహమానుద్దీన్ షేక్, తెలుగు పరిశోధనల లో శాస్త్ర సాంకేతికత వినియోగం పై దాసరి కరుణలు ప్రసంగించారు.

# ఖాతాదారుల సేవ, సౌకర్యం మా బ్యాంక్ మొదటి ప్రాధాన్యం - ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ సి జి ఎం ఎస్ గోపాల్.





హైదరాబాద్ , ఫిబ్రవరి 10



ఈ రోజు స్థానిక దిల్సుఖ్నగర్లోని నూతనంగా ఆధునీకరించబడిన ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చీఫ్ జనరల్ మెనేజర్ ఎస్ గోపాల్ మాట్లాడుతూ తమ బ్యాంకు ఎల్లప్పుడూ ఖాతాదారుల సేవలో నిమగ్నమయి వుంటుందని తెల్లిపారు. తమ బ్యాంకు 9 వసంతాలు పూర్తి చెసుకున్నది అంటే అది కేవలం ఖాతాదారులు తమపై వుంచిన నమ్మకం మరియు వారి ప్రేమ ఆదరణ వలనే అని చెప్పారు. మారుతున్న డిజిటల్ కాలానికి అనుగుణంగా తమ బ్యాంకు కొత్త కొత్త ఆవిష్కరణలు చేస్తూ కొత్త ఖాతాదారులను ఆకర్షిస్తున్నట్లు గోపాల్ తెలిపారు. తదుపరి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసారు. ఈ కార్యక్రమంలో ఐఓబీ డీ జీ ఎం శివరామకృష్ణ, చీఫ్ మేనేజర్ శ్రీదేవి, బ్రాంచ్ మేనేజర్ అమీరున్నీసా, సిబ్బంది మరియు వివిధ ఖాతాదారులు పాల్గొన్నారు. తదుపరి ఉచిత కంటి పరీక్ష మరియు దంత పరీక్షా సేవలను ఎస్ గోపాల్ ప్రారంభించారు.



# భువనగిరిలో పైళ్ళ శేఖర్ రెడ్డి అభివృద్ధి తప్ప... రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది ఏమీ లేదు.

**భువనగిరి లోని అన్ని వార్డులు తిరిగిన.. కేసీఆర్ ప్రభుత్వ అభివృద్ధి కనిపించింది.!**

**భువనగిరి మున్సిపాలిటీ ఎన్నికల్లో ఓటు హక్కుతో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పండి.!**

**భువనగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్చార్జి క్యామ మల్లేష్**

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి భువనగిరిలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్, భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి గత 9 సంవత్సరాల పాలనలో చేసిన అభివృద్ధి తప్ప.. రెండు సంవత్సరాల కాంగ్రెస్ పాలనలో చేసిన అభివృద్ధి లేదని తెలిపారు. భువనగిరి అభివృద్ధి చెందాలంటే బిఆర్ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మరచి ప్రజలను కాంగ్రెస్ పార్టీ మభ్యపెడుతుందని తెలిపారు. భువనగిరి మున్సిపాలిటీలో అన్ని వార్డులు ఎన్నికల ప్రచారంలో తిరిగానని ఎక్కడ చూసినా కెసిఆర్, పైళ్ల శేఖర్ రెడ్డి అభివృద్ధి తప్ప, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల్లో చేసింది ఏమీ లేదని తెలిపారు. ఎన్నికల హామీల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు పూర్తిస్థాయి ప్రజాస్వామిక పరిపాలన అందిస్తామని, తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమ అమరులకు తల్లిదండ్రులకు, భార్యకు నెలకు 25000/- పెన్షన్ ప్రతినెల అందిస్తామని మరియు వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ప్రభుత్వం కల్పిస్తుందని, తెలంగాణ ఉద్యమకారులపై కేసులు ఎత్తివేస్తామని, తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. రెండు సంవత్సరాలు గడిచిన అమలు చేయలేకపోయారని ఆరోపించారు. కళ్యాణ లక్ష్మిలో తులం బంగారం దేవుడెరుగు.. లక్ష రూపాయలు ఇవ్వడం లేదని ఆరోపించారు. గృహిణులకు ప్రతినెల 2500/ ల హామీ ఇచ్చి మోసం చేశారు. వృద్ధులకు 4000/- పింఛన్ ఎక్కడ పోయిందో కాంగ్రెస్ నాయకులను నిలదీయాలని. మరెన్నో హామీలు మరిచి ఉద్యమ నాయకుల్ని ఆరోపిస్తూ కాలం గడుపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఈ మున్సిపాలిటీలో ఓటు హక్కుతో కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని తెలిపారు

